## మా ఇతర ప్రచురణలు:

| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ\|\| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ\|\| |
| 3. | శ్రీ వెంకయ్య స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంధము, తెలుగు | 40 రూ\|\| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ\|\| |
| 6. | శ్రీ వెంకయ్య స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర . | 15 రూ\|\| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ\|\| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ\|\| |
| 10. | మౌన బోధ | 1 రూ\|\| |
| 11. | పిలచిన పలికే దైవం | 1 రూ\|\| |
| 12. | ధర్మమూర్తి | 1 రూ\|\| |
| 13. | బోధ యజ్ఞాయ నమః | 1 రూ\|\| |
| 14. | దివ్య లీలలు | 1 రూ\|\| |
| 15. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 1 రూ\|\| |
| 16. | శ్రీ స్వామి కృప | 1 రూ\|\| |
| 17. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ\|\| |
| 18. | ఆచార్య భరద్వాజ గారి సత్‌సంగము | ఉచితము |
| 19. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 20. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 21. | శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ చరిత్ర | ఉచితము |
| 22. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 23. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 24. | శ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 25. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః | ఉచితము |
| 26. | స్మృతిరహిత ప్రసన్నాయ నమః | ఉచితము |
| 27. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 250 రూ\|\| |



# వార్తాలాపం గ్రంథం పై సమీక్ష



కాపీల కొరకు వ్రాయండి
శ్రీ సాయి మాష్టర్ సేవాట్రస్ట్
పెసల సుబ్బరామయ్య,
గొలగమూడి (పోష్టు),
నెల్లూరు జిల్లా - 524 321.

వెల : 150 రూ|| పేజీలు : 1054

ఓం

## వార్తాలాపం గ్రంథం పై సమీక్ష

శ్రీ భరద్వాజ మాస్టర్ గారు మెచ్చిన "వార్తాలాపం" అనే గ్రంథంలో మానవ జీవితానికి కావలసిన ధర్మసూత్రాలు అన్నీ ఉన్నాయి. ఒక్కొక్క విషయం గురించి ఒక్కొక్క పుస్తకం చదివేకంటే అనేక గ్రంథాల్లో ఉండే సారాంశం సంపూర్తిగా ఈ గ్రంథంలో లభిస్తుంది. పండితులకే గాక పామరులకు సైతం అర్థమయ్యే సులభమైన శైలిలో హృదయానికి హత్తుకు పోయే కథనాలతో ప్రతిఒక్కరు పాటించవలసిన ధర్మాలను ఇందులో వివరించడం జరిగింది. ఇదేదో స్వామివార్లకు సంబంధించిన గ్రంథం అనే అపోహలను విడనాడి ఒక్కసారి తప్పక చదివి ఒక అవగాహనకు వచ్చి ఆ తరువాత మన తోటి వాళ్ళతో కూడా చదివించడానికి ప్రయత్నించండి.

సామాజిక పరంగా గాని, అధ్యాత్మిక పరంగా గాని ఉన్నతశిఖరాలు అధిరోహించాలంటే ధర్మబద్ధమైన జీవితాన్నే గడపాలని పెద్దలందరూ చెప్పున్నారు. కాని ధర్మమంటే ఏమిటో ఏది ధర్మమో, ఏది అధర్మమో మనకు ఎలా తెలుస్తుంది? శాస్త్రాల అధ్యయనం, శ్రవణం వలననే పై విషయం తెలుసుకోగలుగుతాము. కనుక అటువంటి శాస్త్రాలు పఠించడం లేదా శ్రవణం చేయడం ముముక్షువులకు అత్యంత ఆవశ్యకం. వార్తాలాపం అనే గ్రంథం పై కోవకే చెందుతుంది.



శ్రీ ప్రకాశానంద స్వామి, శ్రీ నిత్యానందస్వామి అనే జ్ఞాన స్వరూపులయిన ఇద్దరు మహాత్మల మధ్య భక్తుల సమక్షంలో జరిగిన సంభాషణలు 35 ప్రసంగాల రూపంలో ఈ గ్రంథంలో చేర్చడం జరిగింది. ఈ గ్రంథం జి. ఆర్. త్రివేది గారిచే తెలుగులోనికి అనువదింప బడినది.

శ్రీ ప్రకాశానంద స్వామి వారు ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ జిల్లాలో విజయనగర ప్రాంతమున ఒక గ్రామములో జన్మించారు. అతి చిన్నవయస్సులోనేతల్లిదండ్రులను కోల్పోయినారు. వీరి వివాహానికి నిశ్చయింపబడిన కన్య విధివశాత్తూ వివాహానికి ముందే దివంగతురాలైనది. ఆ సంఘటన స్వామి వారి వైరాగ్యానికి కారణమయినది. ఆ తరువాత కొద్ది సంవత్సరాలకు సైనికోద్యోగి అయిన స్వామివారి మిత్రుని సౌందర్య వంతురాలైన భార్య ప్రసవ సమయమున చనిపోగా మిత్రునితో కూడా శ్మశానానికి వెళ్ళి ఆ దహనక్రియనంతను గమనించడం జరిగింది. అంతటి సౌందర్యం కూడా తృటిలో మాడి మసై పోయేసరికి అది చూచిన స్వామి వారి వైరాగ్యం ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చి. గృహపరిత్యాగ బుద్ధిని ధృఢపరిచెను. గురువాన్వేషణ బుద్ధితో గృహపరిత్యాగం చేసి దేశాటనం చేశారు. ఎన్నో కష్టాలకు గురియై ఆ తరువాత అంచలంచలుగా ఎదిగి ఒక గొప్ప మహాత్ముడుగా రూపొందినారు. శ్రీ స్వామి వారు ఎక్కడికి వెళ్ళినను శ్మశానాలలోగాని, పాడు బడిన దేవాలయాలలో గాని, చెట్టు క్రింద గాని కాలక్షేపం చేసేవారు. వీరి గౌరవ ఆదరాభిమానాలకు పాత్రులయిన సంతులలో శ్రీ నిత్యానంద స్వామి వారు ముఖ్యులు. (పూర్తి వివరాలు గ్రంథంలో).

శ్రీ భరద్వాజ మాస్టర్ గారు ఎంతో మెచ్చి నలుగురినీ చదవమని చెప్పిన గ్రంథమే ఈ వార్తాలాపం. అసలు ఈ

గ్రంథానికి "ధర్మాలాపం" అన్న పేరు సరియైనది అని అన్పిస్తుంది. ఎందుకంటే ఎవరికి సంబందించిన ధర్మాన్ని వారికి (అంటే సన్యాసులకు, సాధువులకు, బ్రాహ్మణులకు, గృహస్తులకు, భార్యా భర్తల ఆదర్శం గురించి, ముముక్షువులు కావాలనుకునే సన్యాసులకు) ఉదాహరణలతో చిన్న చిన్న కథనాలతో మనస్సుకు హత్తుకు పోయేటట్లు వివరించడం జరిగింది. అయితే ఇదేదో స్వామివార్లకు సంబంధించినది మనకు కాదులే అని ముఖచిత్రం చూచి పొరపాటు పడటం జరుగుతుంది. శ్రీ సాయి బాబా జీవిత చరిత్ర, శ్రీ గురుచరిత్ర నిరంతరం పారాయణ చేస్తున్న వాళ్ళకు ఈ గ్రంథం ఒక్కసారి చదివితే మనలో అంతర్మధనం మొదలవుతుంది.

శ్రీసాయి మాస్టర్ గారు బోధించిన విషయాలను మనం ఏమేరకు పాటిస్తున్నాం లేక పాటిస్తున్నామనే భ్రమలో ఉన్నామో తెలుస్తుంది. తద్వారా మనలో ఆత్మవిమర్శ మొదలవుతుంది. ఈ గ్రంథం చదువుతుంటే మొదటి నుండి చివరి వరకూ కూడా శ్రీ భరద్వాజ మాస్టర్ గారు చెప్పినట్లు "క్షణ క్షణము ఆత్మవికాసానికి కృషి చెయ్యడం ఒక్కటే మానవ జీవిత లక్ష్యం కావాలి" అన్న సూక్తి మన మనస్సులో మెదులుతూనే ఉంటుంది. ఈ గ్రంథం చదవడం వలన ఎంతో ఉపయోగముంది కాబట్టి శ్రీ భరద్వాజ మాస్టర్ గారు సత్సంగాలలో చదవమని చెప్పారు.

మొదటి ప్రసంగములో ఒక భక్తుడు శ్రీ ప్రకాశానంద స్వామి గారిని ఏమైనా ఉపదేశిస్తారా అని అడిగినప్పుడు ఆ స్వామి చెప్పిన సమాధానం సాయి సాంప్రదాయం తెలిసి కూడా ప్రతివాళ్ళ దగ్గరకు ఉపదేశాల కోసం పరిగెత్తే వాళ్ళకు కనువిప్పు కలిగిస్తుంది. ముముక్షువుగా జ్ఞానప్రాప్తి కొరకు సన్యాసం స్వీకరించి యోగాభ్యాసం



చేయుచున్న సన్యాసి ఎలాంటి ధర్మాలను కలిగిఉండాలో వివరించడం జరిగింది.

తీవ్ర వైరాగ్యం పొందిన వారు ఎట్టి పరిస్థితులలోను దు:ఖించరని వారి పట్ల ఎవ్వరునూ సానుభూతి వహింపనవసరములేదని, వారి విషయం అంతా భగవానుడే చూసుకుంటారని గీత యందు శ్రీ కృష్ణ భగవానుడు చెప్పిన "యోగక్షేమం వహామ్యహమ్" (పరమాత్మనగు నాయందు అనన్యభావముతో చిత్తమును లగ్నం చేయువాని యోగక్షేమములను నేను వహించుదును) అన్న శ్లోకాన్ని వివరించుటలో 2వ ప్రసంగంలోను, సన్యాసికి ద్రవ్యం ఎందుకు నిషేదమో 3వ ప్రసంగంలో, త్యాగి యొక్క ధర్మాలను గురించి, సత్పురుషుల లక్షణాలను గురించి 4వ ప్రసంగంలోను సోదాహరణంగా వివరించారు. 5వ ప్రసంగంలో బ్రహ్మ విద్యాప్రాప్తికి కాంతాకనకములు విఘ్నములు అని, ముముక్షువు వీటిని త్యజించాలని చెప్పున్నారు.

అశాశ్వతమైనటువంటి మాంస, క్రిమి, మల, మూత్రాదులతో నిండిన ఈ శరీరముపై వ్యామోహం పెంచుకోవడమేగాక వేరే శరీరము మీద కూడా వ్యామోహం పెంచుకొని దాన్ని దక్కించుకోవడానికి మారణహోమం సాగిస్తున్నారు. రాజు నుండి పేదదాక, పండితుని నుండి పామరుని వరకు ఆనాటి నుండి ఈనాటి వరకు ఈ మారణహోమం సాగిస్తూనే ఉన్నారు. తనమీద వ్యామోహం పెంచుకున్న "రాజకుమారునకు" కనువిప్పు కలుగచేసి మోక్షమార్గానికి నడిపించిన "వణికపుత్రిక" కథనాన్ని మరియు గృహస్థధర్మాలను 5వ ప్రసంగంలో వివరించారు.

గీత యందు చెప్పబడిన అసుర రాక్షస ప్రవృత్తుల గురించి 8వ ప్రసంగములో, దైవ ప్రవృత్తికి సంబందించిన 26 గుణముల గురించి 9వ ప్రసంగమ లో చాలా విపులంగా వివరించడం జరిగింది. అదేవిధంగా పరమాత్మ ధ్యానానికి అవసరమగు సాధన సంపత్తి గురించి 12వ ప్రసంగంలో చెప్పడం జరిగింది. ఏకాంతమున దేవుని సేవించుచూ, తక్కువ భోజనము చేయుచు మనోవాక్కాయములను జయించి వైరాగ్య పరాయణుడై ధ్యాన యోగనిమగ్నుడగు నరుడు బ్రహ్మాసాక్షాత్కారమును పొందుటకు సమర్ధుడు అని, గీతలోని శ్లోకాన్ని వివరించారు.

ఎడిసన్ అనే శాస్త్రజ్ఞుని కథనాన్ని వివరిస్తూ, ఇదే ప్రసంగంలో గుడ్డినమ్మకపు సాంప్రదాయంలో ముక్కిడి సాంప్రదాయం గురించి వివరిస్తు ఒకరిని చూచి ఒకరు వాస్తవాన్ని తెలుసుకోకుండానే ఎలా అనుకరిస్తున్నారో చెప్తున్నారు. ఈ ప్రసంగంలోనే ఏదైనా పదార్ధం కావలెనని కోరిక కలిగి ఉండుట గొప్ప దు:ఖమని, ఆశను వదిలివేయుట గొప్ప సుఖమని, పింగళ ప్రియుని ఆశ త్యజించడం వలనే సుఖంగా నిద్రించినదని శ్రీదత్తాత్రేయులవారు పింగళ అను వేశ్య వద్ద ఉపదేశమును స్వీకరించిన దృష్టాంతమును వివరించడం జరిగింది.

13వ ప్రసంగంలో "ఎవరు నన్ను ఎట్లా పొందెదరో అట్లేవారిని 'నేను పొందెదను" అన్న గీతాశ్లోకం గురించి చెప్తూ కృష్ణభగవానుడు రుక్మిణి, అర్జునుల మధ్య జరిగిన వృత్తాంతాన్ని విశదీకరించారు. అదే విధంగా గీతయందలి బ్రాహ్మణ ధర్మాలను వివరించి అందులో క్షమ గురించి "ఎవడైనా తనకు అవమానం చేసినను తనను భాదించినను అతనిపై క్రోధం వహించకుండుట,



అతనిని బాధించ కుండుట క్షమ" అని చెప్పుచూ సమర్ధ రామదాసు గారు, శివాజీ మహరాజులు మధ్య జరిగిన వృత్తాంతాన్ని వివరించడం జరిగింది.

14వ ప్రసంగంలో అంత: కరణము నందలి దోషములను ఎలా నిర్మూలించుకోవాలో చెప్పారు. మలిన మనస్సులో ఉపదేశ బీజం నాటుకోదని చెప్పడం జరిగింది. అర్హత లేని వారికి తనను ఉపదేశించ వద్దని బ్రహ్మావిద్య విలపించుట గురించి చాలా వివరించారు.

15వ ప్రసంగంలో ధనానికి, దైవభక్తికి చాలా దూరమని, శరీరపోషణకు అవసరమైనంత వరకు మాత్రమే ధనాన్ని సంపాదించ వచ్చని చెప్తున్నారు. దరిద్రాన్ని తమంతట తామే స్వీకరించిన మహాత్ములు ద్రవ్యాన్ని, మట్టిని సమానంగానే చూస్తారని కబీరు గురించి ఒక కథనాన్ని వివరించారు. ధనము కలుగచేయు బాధలు గురించి చెప్పుచూ బీదలను పీల్చి ధనమును సంపాదించుట రాక్షస ప్రవృత్తి అని చెప్పడం జరిగింది.

ఇక 16వ ప్రసంగంలో త్రిగుణాల గురించి, సత్సంగంచే కలుగు లాభాల గురించి వివరించారు. నిత్యజీవితంలో కుటుంబ సభ్యుల కోసం ఆరాట పడుతూ, మన జీవిత కాలాన్ని వారి కోసమే వెచ్చిస్తూ కాలం గడిపేస్తున్నాము. మనల్ని తరింప చేయడానికి సాక్షాత్తూ ఆ సాయి నాధులే అభయ హస్తానివ్వడానికి సిద్దంగా ఉన్నా, మనం మాత్రం అందుకోవడానికి సమయం సరిపోవడం లేదంటున్నాము. కానీ వాస్తవానికి ఈ ప్రపంచమంతా కూడా స్వార్ధంతో నిండి ఉన్నదని అందులో మన ఆత్మీయులకు కూడా

మినహాయింపు లేదని 20వ ప్రసంగంలో ఒక యువకుని కుటుంబం ద్వారా కనువిప్పు కలుగ చేస్తున్నారు స్వామి.

కనుక అది చదివిన తరువాత అయినా మన బాధ్యతలను బంధాలుగా మార్చుకోకుండా, మన పరమార్ధిక శ్రేయస్సుకే కృషి చెయ్యాలి అన్న నిర్ణయానికి వస్తే మంచిదేమో! ఈ ప్రసంగంలోనే సిద్ధార్థుడు బుద్ధభగవానునిగా మారిన వైనాన్ని చెప్పడం జరిగింది.

21వ ప్రసంగంలో సత్పురుషుల సాత్వీక సంపదకు, రాజుల రాజస సంపదకు గల భేదాన్ని వివరించారు.

22వ ప్రసంగంలో గృహస్తాశ్రమ ప్రాధాన్యతను వివరిస్తూ "భార్య సహచర్యముచే ధర్మ, అర్ధ, కామములనే మూడు పురుషార్ధాలు సిద్ధించుతాయని, గృహస్థాశ్రమము అజేయమగు కోట అని, అన్ని ఆశ్రమములకును ఆధారమని వర్ణించారు. 23వ ప్రసంగంలో ఆధారముగల వాక్యము బాలుడు చెప్పినను గ్రహించవలెనని, నిరాధారమైనది బ్రహ్మ చెప్పినను గడ్డి పోచతో సమానముగా చూచి త్యజించవలెనని యోగవాశిష్టంలోని శ్లోకాన్ని చెప్తూ ఒక మార్వాడి కథను ఉదహరించారు. 24వ ప్రసంగంలో అతిధి సత్కారం గురించి తుకారాం వ్రాసిన అభంగంలోని విషయాన్ని, సత్సాంగత్యము గురించి ఒక నగర శ్రేష్ఠి ఉదాహరణతో వివరించారు.

25వ ప్రసంగంలో గృహస్థాశ్రమము గురించి వివరించారు. అలానే భార్యాభర్తల ఆదర్శం గురించి వివరిస్తూ కబీరు దృష్టాంతమును ప్రస్తావించారు.



ఇద్దరు, ముగ్గురు గృహస్థులు తమ సందేహాలను నివారణ చేసుకొనుటకు ఒక రోజు ఉదయం కబీరు వద్దకు వస్తారు. అపుడు కబీరు నేత నేయుచుండెను. వారు కబీరుతో "జ్ఞానం సంపాదించుటకు గృహస్థాశ్రమము నందు సులభమా? సన్యాసాశ్రమమునందు సులభమా అని ప్రశ్నించిరి". అపుడు కబీరు తన భార్యను త్రాడు తెగినది, అతుకుటకు దీపం తీసుకురా అని ఆజ్ఞాపించెను. ఆమె దీపం తీసుకు వచ్చెను.

అదే విధంగా భార్య భర్తల ధర్మము గురించి కూడా నోదాహరణముగా వివరించు చున్నారు. భార్యయును, భర్తయును ధర్మము నందును, సంసారిక కార్యములందును, భోగములనందు పరస్పరము వ్యతిరేకములగు అభిప్రాయములతో ఉండరాదు. ధర్మకార్యముల యందు వ్యతిరేక భావాలను కలిగియుండని భార్య సహధర్మచారిణి అనబడును. తండ్రి భర్తకు కన్యాదానం చేసినపుడే భర్త గోత్రమునకు ఆమె సంబందించునని భర్త గోత్రమే ఆమె గోత్రమని అదే ధర్మం కూడానని స్వామి నిత్యానందుల వారు ఒక బ్రాహ్మణుడి కధ ద్వారా వివరిస్తున్నారు.

## బాలికలకు చెప్పదగిన చదువు

కుమారునకు చదువు చెప్పించునట్లుగానే కుమార్తెకు గూడా వ్యవహార జ్ఞానమును, పరమార్ధజ్ఞానమును కలిగించు చదువు చెప్పించవలెను. అత్త, మామ, భర్త మొదలగు వారితో ఎట్లు ప్రవర్తించవలెను అనునది తల్లి నేర్పాలని చెప్తున్నారు. భర్తతో మెలగ వలసిన రీతులు తెలియనట్టియు, భర్తను సేవించుట తెలియనట్టియు బాలికకు వివాహం తండ్రి చేయరాదని చెప్తున్నారు.

ఉదయపురరాణా తన కుమార్తె భర్తయందు చేసిన అపరాధమునకు బాధపడి ఆసేవ తను చేసి తన కుమార్తె ధర్మమును గుర్తించలేకపోయింది క్షమించండి క్షమించండి అని అల్లుడిని వేడుకొనుట ఒక చక్కని కధనం ద్వారా వివరిస్తున్నారు. కనుక గృహస్థాశ్రమ దర్మాలను నేర్పుట తల్లిదండ్రుల ధర్మమని చెప్తున్నారు.

న్యాయముగా ధనమును సంపాదించు వాడును, తత్వజ్ఞానము నందు నిష్ఠ కలవాడును, అతిధులందు ప్రేమ కలవాడును, శాస్త్రజ్ఞుడును, సత్యవ్రతుడు అయినవాడు గృహస్థాశ్రమమునందే ముక్తిని పొందుతాడు అని నిత్యానంద స్వామి గారు వివరిస్తున్నారు.

దేవుని అస్తిత్వం గురించి, జీవుని అస్తిత్వం గురించి 26వ ప్రసంగంలోను, దేవుని స్వరూపం గురించి, ఉపాసన గురించి, వైరాగ్యం గురించి మరియు సిద్ధార్థుని వైరాగ్య వివేకము గురించి 27వ ప్రసంగములోను చాలా విపులంగా వివరించారు.

28వ ప్రసంగంలో జ్ఞానాన్ని పొందుటకు గురువు అవసరమని దానికి ఉదాహరణగా నారద సనత్కుమారుల మధ్య జరిగిన సంభాషణను ఉదహరించారు. ఇదే ప్రసంగంలో ఆచార్యుని లక్షణాల గురించి యజ్ఞోపవీత రహస్యం గురించి, సంతుల లక్షణాల గురించి చెప్పారు.

ఒక్క గురువు మీదే శ్రద్ధ వుంచి కర్తవ్యమును నిర్వహించమని, మహాత్ముల శీలము గురించి, వారం రోజులలోనే



భాగవతం చదివి వైరాగ్యాన్ని పొందిన మహా వ్యక్తి రాయ్‌జీభాయి గురించి, పవిత్రత గురించి, బ్రహ్మ విద్యాప్రాప్తికి 101 సంవత్సరములు బ్రహ్మచర్యమును ఆచరించవలెనని ఆ 101 సంవత్సరములనగా అర్థమేమిటో వివరించారు. భక్తికి అత్యంతావశ్యకమైన త్యాగం గురించి, జ్ఞానానికి కావలసిన భక్తి వైరాగ్యాలను, విషయ వాసనల ప్రాబల్యములను 29వ ఉపన్యాసములో సంపూర్తిగా వివరించారు.

30వ ప్రసంగంలో వైరాగ్య భేదాల గురించి, ఏకాంత మహత్యం గురించి, సాంగత్యముచే కలుగు లాభాల గురించి సవివరంగా వివరించారు.

31వ ప్రసంగంలో పూర్వపు సన్యాసులకు ఇప్పటి సన్యాసులకు మధ్య ఉన్న తేడాలను, రాజ్యాన్ని త్యజించి పూర్ణ విరాగి అయిన భర్తృహరి మహారాజు గురించి, నిజమగు సన్యాసి లక్షణములను ప్రస్తావించారు.

32వ ప్రసంగంలో కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగాలలో భక్తియోగం సులభమని, సామాన్యులకు సులభమయినది భక్తియని మరియు నవవిధ భక్తుల గురించి వివరించారు. ఒక గీతా పండితుని ఆస్తిక్య బుద్ధిని గురించి మనస్సును కదిలించే రీతిగా చెప్పడం జరిగింది.

ఒక గ్రామములో బ్రాహ్మణ పండితుడు ఉండేవాడు. అతడు శ్రీకృష్ణపరమాత్ముని పరమ భక్తుడు. నిత్యం గీతను పఠించుచుండుట వలన గీతా పండితుడని పిలిచేవారు. కుటుంబ పోషణ గురించి ఏమీ పట్టించుకొనక అయాచితముగా,

అనాయాసముగా లభించిన దానితో కుటుంబ పోషణ చేసెడివాడు. భార్య అతనితో ఎంత చెప్పినా "ఇంతవరకు నేను యాచించలేదు కావున ఇక ముందు యాచించుటకు వెళ్ళను" అని అతడు చెప్పెను. పిల్లలు మనము ఆకలితో చచ్చిపోతున్నాము. బ్రాహ్మణులం కదా! గ్రామములోనికి వెళ్ళి ఏదియో ఒకటి యాయవారము అడిగి తీసుకొనిరమ్మని భార్యకోరగ అందుకు కూడా ఆ బ్రాహ్మణుడు ఇష్టపడక ప్రభువునందు శ్రద్ధాభక్తులు కలిగి ఉండమని చెప్పెను. "ప్రభువు నందు శ్రద్ధాభక్తులు కలిగి ఉండుటచే కడుపు నిండదు" అని భార్య మరలా సమాధానము చెప్పెను. అంతట గీతా పండితుడు ఆమెకు గీతలో శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన శ్లోకాన్ని ఈ క్రింది విధంగా వివరించాడు.

*అనన్యాశ్చిన్త యన్తోమాం యేజనాః పర్యుపాసతే,*
*తేషాంనిత్యాభియుక్తానాం యోగ క్షేమంవహామ్యహమ్*

నాయందలి అనన్య భక్తితోనున్న చింతన చేయుచు, నన్ను ఉపాసించుచు, నాయందు నిత్యము ప్రేమను చూపుచు ఉండు నా భక్తుల యోగ క్షేమములను నేను చూచెదను.

యోగము అనగా లభించునది లభించునట్లు చేయుట, క్షేమము అనగా లభించిన దానిని కాపాడుట. గీత యందు శ్రీకృష్ణభగవానుడు చెప్పిన ప్రకారం ఆయన యందు శ్రద్ధ కలిగి యుండుమని బ్రాహ్మణుడు భార్యతో చెప్పెను. అప్పుడు ఆమె ఆ

వ్రాసినది తప్పు అని తాళపత్ర గ్రంధము నందు ఉన్న ఆ శ్లోకమును ఆమె ఘంటముతో ముమ్మారు కొట్టి వేసెను. అంతట గీతా పండితుడు కోపించి " నాప్రభువు యందు నీకు



నమ్మకములేదా? ఎందుకిలా చేశావని", అని మిక్కిలి ఖేదముతో ఆయన ఇంట నుండి బయటకు వెళ్లి ఏకాంత స్థలములో గీత పఠనం చేస్తున్నాడు. ఆతరువాత ఒక యువకుడైన గొల్ల ఒక కావడిలో పప్పు, పిండి, నెయ్యి, పెరుగు, పంచదార, కూరలు మొదలైన పదార్థాలు తీసుకొని గీతా పండితుని ఇంటికి వచ్చి ఎంతో అలసి పోయినట్లు కూర్చొనెను. గీతా పండితుని భార్య ఇవన్నీ ఎవరు పంపారనగా మా శేఠుగారు మీగురించి పంపారు తీసుకొనండి అని చెప్పెను. ఆమె సంతోషించి వంట వండెను. భుజించి వెళ్ళమని ఆవిడాగొల్లను పట్టుపట్టగ అతడు "నాకు భుజించు సామర్థ్యం లేదు. నా నాలుకపై మూడు పుండ్లు పడి రక్తం స్రవించు చున్నది. అమ్మా నేవెళ్తున్నాను నాలుక మీద మూడు పుండ్లు పడిన మనుష్యుడు వచ్చి ఇవి ఇచ్చి వెళ్లాడని గీతాపండితునితో చెప్పమని వెళ్ళిపోయాడు.

గీతా పండితుడు సాయంకాలం ఇంటికి వచ్చి ఇంటిలోని మంచి ఆహారములను చూచి విస్మయంతో ఇవి అన్ని ఎక్కడివి అని అడుగగా " ఎవరో శేఠ్ యొక్క గొల్ల, నాలుక పై మూడు పుండ్లు పడినవట అని భార్య చెప్పగా శ్రీ కృష్ణపరమాత్ముడే వచ్చారు. నీవంటి పాపాత్మురాలికి దర్శనమిచ్చాడు కాని నేను మాత్రం యధాప్రకారంగానే ఉన్నాను. అవి నాలుక పై పుళ్ళు కావు నీ ఘంటపు కొట్టి వేతలు ఇప్పుడైనా తెలిసి కొని పరమాత్ముని పై అచంచలమగు శ్రద్ధా విశ్వాసములను కలిగి ఉండు భక్తులు భవిష్యత్ గురించి చింతించక పోయినచో ప్రభువే తాను తన భక్తులను రక్షించును అని భార్య తో చెప్పాడు అలానే సాయినాధులు కూడా అదే విషయాన్ని మనకు చెప్పారు.

ఈ33వ ప్రసంగంలో సత్యమే ధర్మమని సత్యం గురించి సవివరంగా వివరించారు. అదే విధంగా శ్రోతలు చాలా మంది

ఉన్నా వస్తువును గ్రహించు తీవ్ర వైరాగ్యవంతుడు దొరుకుట దుర్లభమని శ్రోతలలోని భేధాలను గురించి వివరించారు.

జీవన్ముక్తుడు తప్ప మిగిలిన వారి వద్ద నుండి ఉపదేశములను గ్రహించరాదని, అనుభవం పొందకుండా చేయు ఉపదేశము చేయు గురువులు, అవి స్వీకరించు శిష్యులను కూడా ఒక గుడ్డివాడు ఇంకొక గుడ్డివాడికి దారి చూపించు కధనం ద్వారా చక్కగా వివరించారు. సాయినాధులు కూడా ఎప్పుడూ ఎవ్వరి దగ్గరకూ ఉపదేశాల కోసం వెళ్ళవద్దని 365 రోజులూ తనబోధ అన్ని దిక్కుల నుండి మనకు అందుతూనే ఉంటుందని చెప్పిన విషయం అందరికి కనువిప్పు కలిగించాలి.

సత్వగుణ భేదాల గురించి, వైరాగ్య భేదాల గురించి, యోగప్రాప్తి గురించి, సరియగు అభ్యాస పద్దతి గురించి, మోక్షమను కోటను జయించు విధానము గురించి కధనాల ద్వారా చెప్పడం జరిగింది.

కామక్రోధాది శత్రువులు మానవుని మోక్షపు కోట దగ్గరకు కూడా దరి చేరనీయవు. కాని, వివేకము అను అశ్వముపై కూర్చొని, తీవ్ర వైరాగ్యము అను ఖడ్గమును ధరించి తితిక్ష (సర్వదు:ఖములను సహించుట) అను కవచమును ధరించిన వానిని ఎవ్వరును ఆపలేరు అని చెప్పుచూ ఉత్తరకుమారుని కథను ప్రస్తావించారు.

34వ ప్రసంగంలో వ్యసనం - భానిసత్వమును, అసుర గుణములను, సన్యాసికి నిషిద్ధమైన గృహాదుల గురించి, కలికాలపు తత్త్వవేత్త గురించి, మదాందుని ప్రవర్తనను, కామ త్యాగం చేయునంతవరకు ఎవరికిని సిద్ధి కలగదని కామ (కోరిక) త్యాగముచే



బ్రహ్మసిద్ధి కలుగునని ఇందుకి గురించి ఒక చక్కటి కథను వివరించారు. కామమును నశింప చేయు ఉపాయం గురించి కూడా చెప్పారు.

ఇక చివరగా 35వ ప్రసంగంలో శ్రీ నిత్యానందస్వామి గారి దేహ త్యాగ విషయం ప్రస్తావించారు.

విషయ భోగములందు విరక్తి గురించి, దేహాభిమానము కలుగచెయు అనర్ధములను గురించి వివరిస్తూ ఆత్మప్రాప్తికి గురువు, సాధనములు ఎలా అవసరమో ఈ క్రింది కథ ద్వారా చెప్తున్నారు.

ఈ శరీరం అనిత్యము క్షణ భంగురము మన కళ్ళ ముందే ఎంతో మంది చనిపోతున్నారు. మనకు అత్యంత ఆప్తులు, మన కుటుంబ సభ్యులు మనల్నివీడి తిరిగిరాని లోకాలకు వెళ్ళుచున్నారు. సంపాదించిన సంపదనంతటిని ఈ లోకంలోనే వదిలేసి క్షణాలలో మాడి మసై పోతున్నారు. మనం ఎంత రోదించినా తిరిగి రావడం లేదు. మనం సంపాదించిన డబ్బు వాళ్ళు లేని లోటు తీర్చడం లేదు. మరి ఇవన్నీ ప్రతిక్షణం మనకు అనుభవమవుతున్నా కూడా మనలో మార్పు రావడం లేదు ఎందుకని? ఈ శరీరం మీద, ధనం మీద వ్యామోహం తగ్గడం లేదేమి? శ్రీసాయి వంటి సద్గురువు మీద భక్తి పెరిగే కొద్దీ ధనం మీద వ్యామోహం తగ్గుతుందని శ్రీ భరద్వాజ మాస్టారుగారు చెప్పారు.

ఈ శరీరం అమూల్యమైనదని, మోక్ష సాధనమని తెలుసుకొని కూడా, మోక్షద్వారమగు శరీరమును పొంది కూడా మోక్షమును సంపాదింపక బ్రతికి ఉన్నంత కాలం ఈశరీరమును

ప్రేమించుచూ మనల్ని మనమే ఎలా నాశనము చేసుకుంటున్నామో స్వామి వారు ఈ కథ ద్వారా వివరిస్తున్నారు.

మద్రాసులో ఒక వర్తక శ్రేష్టుడు ఉండేవాడు. అతనిని ప్రజలంతా కుబేరుని అవతారంగ భావించేవారు. అతడు యవ్వన మందే సంసార బంధనములను త్యజించి అంతులేని త్యాగం చేసాడు. అతడు ఒక పద్యము నందు "ఈశరీరము ఎప్పుడు మృత్యు ముఖమున పడునా, ఎప్పుడు మేము తినెదమా అని పశుపక్ష్యాదులు ఉవ్విళ్ళూరు చున్నవి. నేను భక్షించెదనని అగ్ని పరవళ్ళు త్రొక్కుచున్నది. నావంతు అని భూమి కనిపెట్టుకుని ఉంది. మాకు కావలెనని జలచరములు తలపోయుచున్నవి. ఈనశ్వరమగు మురికి శరీరమును మృష్టాన్నములతో పెంచి సుందరమైన వస్త్రభూషణములను ధరింప చేసి వెండి పల్లకిలో కూర్చుండ బెట్టి ఎందరో ప్రేమింతురు. అంత పెద్ద తప్పు నేను ఎందుకు చేయ్యాలి" అని అన్నారు. ఈ విధంగా మహాత్ములందరూ కూడా వైభవాలను త్యజించి శరీరము నందు పరిపూర్ణ వైరాగ్యాన్ని పాటించి తమ కర్తవ్యాన్ని సాధిస్తారని చెప్పున్నారు. ఇలాంటి ఎన్నో మనస్సుకు హత్తుకుపోయె ఉదాహరణలతో చెప్పడం జరిగింది. అదే విధంగా విషయ భోగములందు విరక్తి గురించి దేహాభిమానం కలుగ జేయు అనర్థం గురించి వివరిస్తూ అత్మప్రాప్తికి గురువు ఎలా అవసరమో ఈ క్రింది కథనం ద్వారా తెలుస్తుంది.

దక్షిణ దేశములో నలుగురు మిత్రులున్నారు. ఒకరు వైద్యుడు, రెండవవాడు గాయకుడు, మూడవవాడు జ్యోతిష్యుడు, నాల్గవవాడు తార్కికుడు. వీరు ఒకరోజు వేరే ప్రదేశానికి వెళ్ళారు అక్కడ వంట చేసుకొనుటకు నలుగురూ పనులు పంచుకున్నారు. గాయకుడు వంటకు, వైద్యుడు కూరలు తెచ్చుటకు, జ్యోతిష్యుడు



ఆకులు తీసుకు రావడానికి, తార్కికుడు నెయ్యి, పాలు మొదలగునవి తీసుకు రావడానికి. గాయకుడు సరిగమ స్వరములతో తాళ, లయ సమన్వితముగా గానం చేస్తూ, ఉడుకు శబ్దము తనగానానికి శృతి కలుపుట లేదని, తాళం భేదిస్తున్నదని కోపంతో దుడ్డు కర్రను తీసుకొని కుండలను గట్టిగా కొట్టాడు. కుండలు బద్దలయి అన్నాదులు పొయ్యిలో పడి పొయ్యి ఆరిపోయింది. కూరలు తీసుకు రావాడానికి వెళ్ళిన వైద్యుడు ఏకూర నచ్చక ఒకటి పైత్యము మరొకటి వాతము, ఇంకొకటి శ్లేష్మము చేయునని తలచి ఏమీ కొనకనే వచ్చాడు. జ్యోతిష్యుడు ఆకులకు మర్రి చెట్టు వద్దుకు వెళ్ళి బల్లి మూడుసార్లు కూసేటప్పటికి శకునం బాగా లేదని వెనక్కి వచ్చాడు. తార్కికుడు నెయ్యి, పాలు తెచ్చుటకు వెళ్ళి చేతికి గిన్నె ఆధారమా, లేక గిన్నెకు నెయ్యి ఆధారమా అను సందేహం కలిగి ఆ సంశయాన్ని నివారించుటకు తన చేతి యందలి పాత్రలను బోర్లించి చూశాడు, అన్నీ క్రింద పడిపోయాయి. అతడు కూడా రిక్త హస్తముతో తిరిగి రావడం జరిగింది. చివరకు వాళ్ళు సాధించినది శూన్యం కనుక కుతర్కములు చేసి ఆత్మతత్వమును తెలుసు కొనలేరు. గురూపదేశము వలననే ఆత్మ సాక్షాత్కారము కలుగునని చెప్పడం జరిగింది. అందుకే చేతిలో సమిధలు పట్టుకొని బ్రహ్మజ్ఞానమును పొందుటకు శ్రోత్రియుడను, బ్రహ్మజ్ఞుడును అగు గురుని చెంతకు వెళ్ళవలెనని చెప్పున్నారు.

ఇంతటి చిన్న వయస్సులో దేవుడు, యోగాభ్యాసం ఎందుకు? వయస్సు మళ్ళిన తరువాత చూద్దాములే అని చాలామంది అంటూ ఉంటారు. అలాంటి వాళ్ళకు కనువిప్పు కలిగేలా ఒక జమిందారు కధనాన్ని చెప్పడం జరిగింది.

అతి చిన్న వయస్సు గల జమిందారుడు 25 గ్రామాలకు అధిపతి ఆ వయస్సు నందే యోగం నేర్చుకోవడానికి గురువు వద్దకు వెళ్ళినప్పుడు బ్రహ్మానందమగు భోగమును అనుభవించదలచినట్లైతే విషయ భోగములను విసర్జించాలి. మనుష్య జన్మ అమూల్యం స్వర్గము నందలి దేవతలు కూడా మోక్షమును పొందుటకు మానవ జన్మను కోరెదరు. ఈ జన్మ చింతామణి వంటిది. దీన్ని తుచ్ఛమైనలౌకిక విషయ భోగాలకు అమ్మి వేయరాదని చెప్పి ఆ గురువు అతనికి యోగమును భోదించెను. అప్పటి నుండి ఆ జమిందారుడు ఏకాంతమున యోగమభ్యసించుచున్నాడు. మిత్రులు అతనిని చూచి "యోగము వార్ధక్యమున లభించును ఈవయస్సు అందుకు తగినది కాదు" అని అంటుండగా ఈమాటలు చెవికెక్కి ఆ జమిందారుడు యోగాభ్యాసమును విర్జించి తప్పు త్రోవ తొక్కాడు అతనికి 70 సం|| వయస్సు వచ్చే సరికి అతని దేహేంద్రియాలు శిధిలమయ్యాయి. అతనికి మళ్ళీ యోగం అభ్యసించాలని కోరిక కలిగింది, కాని దేహం సహకరించ నందున అది జరిగే పని కాదు అతడు ఎంతో పశ్చాతాప పడ్డాడు. సంసార భోగ విలాసాల యందు చిక్కి నాజన్మ వ్యర్ధమైనదని" అయ్యో చింతామణిని గాజుముక్క ఖరీదుకు అమ్మి వేసితినే అని భాధపడూతూ ఎంతో పరితపించాడు. ఇది మనకు కనువిప్పు కావాలి. ఎంతో విలువైన కాలాన్ని సంవత్సరాల తరబడి వ్యర్ధం చేసుకున్నామే భగవంతుడా అని మనం పడే బాధను మన బిడ్డలు పడకుండా చిన్నప్పటి నుండే వాళ్ళకు దైవం మీద ప్రీతి కలిగేలా, భక్తికలిగేలా, నైతిక విలవలు తెలుసుకునేలా పెంచే భాద్యత మనం వహించాలేమో ఒక్క సారి ఆలోచిస్తే బాగుంటుంది.

ఈ ప్రసంగంలో సత్యం కంటే కూడా అసత్యమనేది మనుషుల్ని ఎలా ఆకర్షిస్తుందో ఈ కథ ద్వార చెప్తున్నారు.



ఒక రాజకుమార్తె తన నలుగురు స్నేహితులతో కలసి మాట్లాడుతూ ప్రపంచము నందు దేనియందు ఆనందం లభిస్తుందని వాళ్ళని అడినప్పుడు ముగ్గురు మూడు రకాల విషయాలు చెప్పగా గాయకి అయిన 4వ స్నేహితురాలు ప్రపంచమున ఎక్కువ సుఖము, ఆనందము అసత్యము వలన కలుగునని చెప్పింది. అది ఎట్లా అని రాజకుమార్తె అడుగగా ఇప్పుడు నాకు మీరు లక్షా పాతిక వేలు ఇచ్చినచో ఒక సంవత్సరం తరువాత సమాధానం చెప్తానన్నది. ఇదంతా విన్న రాజుగారు ఆధనాన్ని ఇచ్చారు. ఆ గాయకి ఒక సంవత్సరం సెలవు తీసుకొని ధనాన్ని స్వీకరించి రెండవ రోజున సారంగి, తబల వాద్యములతో నలుగురు మనుష్యులను తీసుకుని దూర దేశమునకు పోయేను. ఎంతో సౌందర్యవతి, కంఠము మధురము, గాన విశారద అయిన ఆమె శ్వేత వస్త్రములు కట్టుకొని తులసి మాలను ధరించి వెళ్ళిన ప్రతి గ్రామములో బలమైన డేరావేసి అపర మీరాబాయి వలె అభినయముతో పాటలు పాడు చుండగా నేత్రముల నుండి వచ్చు ఆనందాశ్రువులు ప్రజల హృదయమును ద్రవింప చేయుచుండగా, అహా! ఈమె నిజంగా మీరాబాయి అవతారమని అనటం మొదలుపెట్టారు.

ఈ విధంగా ఆమె తన బృందముతో దేశదేశాలు సంచరించుచు ఆదేశ వాసులకు పూజలచేత, భజనలచేత భక్తి భావము వృద్ధి నొందించుచూ చివరకు భగవద్దర్శనము అగునట్లు కూడా చేయింప సాగెను. తనతో డేరాలోకి తీసుకు వెళ్ళి ఆజోడు పై దృష్టి నిలిపి భగవద్దర్శనమయినట్లు భావన చేయుచు తన్మయత్వాన్ని పొంది గద్గద స్వరముతో స్తోత్రం చేసేది. ఆ తరువాత చెప్పు జోడును చూపించి భక్తులతో "చూడండి సాక్షాత్తు శంఖ చక్ర గదాధరుడగు విష్ణుభగవానుడు భక్తులకు దర్శనము ఇచ్చుచున్నాడు,

నిక్కచ్చియైన తల్లిదండ్రుల బిడ్డలకు మాత్రమే కనిపిస్తారని చెప్పేది". అంతట అందరూ కూడా తమ తల్లిదండ్రులు అపవిత్రులని అనుకుంటారేమోనని చెప్పు జోడును చూచి కూడా భగవద్దర్శన మయినది అని చెప్పేవారు.

ప్రపంచంలో సత్యం కంటే అసత్యమనేది మనుషుల్ని ఎలా ఆకర్షిస్తుందో ఈ కథ ద్వారా చెప్తున్నారు. అదే విధంగా రాక్షస అసుర ప్రవృత్తులలో ఒక గుణం వచ్చినచో మిగిలిన అన్ని గుణములు వెంట వెంటనే వస్తాయని చెప్పడం జరిగిరిది.

ఒక రాజు ఒక ప్రదేశమున వేదము, మద్యము, వేశ్య ఈ మూడు వస్తువులను ఉంచి

*ఈ వేదం అబద్ధం అని చెప్పండి* లేదా

*ఈ మద్యమును సేవింపవలెను* లేదా

*ఈ వేశ్యను అనుభవించవలెను* అని ఆజ్ఞాపించెను.

అట్టివారికి దక్షిణ లభిస్తుందని చెప్పారు. బ్రాహ్మణులందరూ కూడా ఆషరతులను విని వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. ఒక బీద బ్రాహ్మణుడు దక్షిణకు ఆశపడి " పోనీలే మద్యం తాగు దాము ఆ తరువాత ప్రాయశ్చిత్తం చేసుకోవచ్చు" అని తలచి రాజువద్దకు వెళ్ళి మద్యపానం చేస్తానని చెప్పాడు. ఆ మూడు వస్తువులు ఉన్న ప్రదేశమునకు ఆ బ్రాహ్మణున్ని పంపి రాజు బయట కూర్చున్నాడు. అతడు మద్యమును స్వీకరించి అంతకంతకు మత్తెక్కి అనంతరం ఒళ్ళు తెలియని పరిస్థితులలో వేశ్యను గూడా అనుభవించుటకు వెళ్ళబోయాడు. అప్పుడు రాజు " ఆపని వేదము నందు నిషేదించ బడినదని" చెప్పెను. వెంటనే ఆ బ్రాహ్మణుడు ఆ వేదములు అసత్యములు అని పలికెను.



ఈ విధంగా ఒక నిషిద్ధ పదార్ధమును స్వీకరించిన తరువాత మరొక నిషిద్ధ పదార్ధమును స్వీకరించరాదను వివేకము పోతుంది. నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్క చెడ్డ గుణం వచ్చి మనుష్యుని వశపరచుకుని పతనం చేస్తాయి అని చెప్పి మనలను జాగ్రత్త వహించ మంటున్నారు.

దైవీ సంపదలోని గుణములలో ఒకటి రెండింటిని జాగ్రత్తగా మనం ఆచరించినట్లయితే మిగిలినవి వాటంతట అవే మన మనస్సును ఆక్రమించి వేస్తాయని ఈక్రింది కథనం ద్వారా వివరించడం జరిగింది.

ఒక గ్రామానికి మహాత్ముడు ఒకాయన వచ్చారు. అది చూచి ఒకడు ఆయన చెంతకు వెళ్ళి ఏద్రైన మంత్రము ఉపదేశించమని ప్రార్ధించాడు. నీవు ఏంచేస్తుంటావని ఆ స్వామి అడుగగా అతడు "దొంగ తనం చేస్తాను, జూదమాడుతాను, కల్లు త్రాగుతాను, అబద్ధం కూడ ఆడతానని చెప్పాడు". సరే వీటన్నింటిలో ఏదో ఒకటి మానుకోనుటకు ప్రతిజ్ఞ చేయుమని స్వామి అడుగగా అతడు మిగతావి మానుకోలేను గాని అబద్ధం ఆడటం మానుకోగలనని తలచి స్వామి! "నేటి నుండి అసత్యము పలుకను" అని చెప్పాడు.

స్వామి వారు సరే అని అతనికి మంత్రదీక్ష ఇచ్చారు. కొద్ది దినముల తరువాత అతడు దొంగతనానికి రాజభవనానికి వచ్చాడు. అప్పుడు రాజు చూచి ఎవరివి నీవు అని అడుగగా నేను దొంగని అని చెప్పగా, నేనూ దొంగనే, ఇద్దరం కలిసి ఖజానా దొంగిలిద్దాం అని చెప్పి, నీవు దొంగవని నమ్మకమేమి? తరువాత నన్ను పట్టించి వేయుదవేమో! అని అనగా ఆదొంగ తాను అబద్ధమాడనని గురువు

చెంత చేసిన ప్రతిజ్ఞను వివరించి చెప్పెను. రాజునకు అతని పై నమ్మకం కలిగి "నేను తాళం చెవులు సంపాదించితిని నీపని తేలిక చేసితిని" అని పలికెను. తరువాత వారిద్దరు కలిసి ఖజానా సంగ్రహించిరి. పిదప వారిరువురునూ పంచుకొనుచు, ఒక బంగారు పెట్టె నుండి 3 వజ్రములు తీసికొనిరి. అవి ఎట్లు పంచుకొనవలెనని సందేహము కలిగెను. అపుడు రాజు "ఒక వజ్రం రాజునకు ఉండనిచ్చి మిగిలినవి మనము పంచుకొనెదము" అని అట్లు చేసి వారిరువురు విడిపోయిరి. రాజు దొంగ యొక్క చిరునామాను తీసుకొనెను. తన యొక్క చిరునామాను మాత్రం సరియైనది ఇవ్వలేదు. రెండవ రోజున దివానును పిలిచి "దొంగ తనము జరిగినది .ఏమేమి పోయినవో తెలిపి దొంగను పట్టుకొనుము" అని ఆజ్ఞాపించెను. దివాను ఖజానాను వెతకగా ఒక వజ్రం దొరికెను. అది అతడు దాచు కొనెను. రాజు వద్దకు వచ్చి ఏమియును లేవు, అన్ని తీసుకొని పోయెను, దొంగ దొరక లేదు అని చెప్పగా, రాజు దొంగ చిరునామాను తెలిపి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించెను. దొంగ హాజరవ్వగా దర్బారులో దొంగతనము చేసితిని, ఇద్దరం కలిసి చేశాం చెరొక వజ్రం తీసుకొని ఒక వజ్రాన్ని మీకొరకు ఉంచితిమని దొంగ చెప్పెను. అపుడు దివానుతో "ఆవజ్రం నీ దగ్గరే ఉన్నది బయటకు తీయుమనగా ఆ దివాను చేయునది లేక వజ్రమును బయటకు తీసి ఇచ్చెను. నేటి నుండి ఈ దొంగే "దివాను" ఎందుకంటే ఇతడు నిజం చెప్పున్నాడు. నమ్మదగిన వాడు అని రాజు ఆ దొంగతో నీకు నిజం చెప్పమని ఆజ్ఞాపించిన "గురువులు ధన్యులు" వారి ఆజ్ఞను పాటించి నీవు ఈ స్థితికి వచ్చితివి. నీవు దర్శించిన ఆగురువు గారిని నేను కూడా దర్శించెదను. నాకు కూడ చూపమని, వారి సదుపదేశమును నేను కూడా స్వీకరించెదను అనెను.



అపుడు దొంగ ఒక్క సత్యవాక్పాలనము మాత్రముననే నేను దివాను పనిని పొందితిని కదా అని దైవీ సంపదకు చెందిన ఇతర గుణములను ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించెను. ఒకసారి వారు గురువు అక్కడకు వచ్చినపుడు వారి పాదాలపై బడి నమస్కరించెను. 'నీవెవరివి?' అని గురువు ప్రశ్నించగా మీరు ఇంతకు ముందు వచ్చినపుడు నాకు దీక్ష ఇచ్చారు. అసత్యమాడనని మీకు ప్రతిజ్ఞ చేశాను. సత్యపాలన చేతనే ఈ దివాను పదవి నన్ను వరించిందని చెప్పెను. అపుడు అది విని గురువు చాల సంతోషించి ఆనందంతో నా దగ్గర చాలా మంది దీక్ష తీసుకున్నారు. కానీ పాలించినది నీవు మాత్రమే అనెను. ఈ దివాను రాజుగారికి కూడా దర్శనము చేయించి నేను ఈ పదవి త్యజించి గురుసేవను స్వీకరించు చున్నానని చెప్పెను. అపుడు రాజు సంసారిక పదార్ధములను త్యజించి సత్పురుషుల సంసర్గంతో త్యాగ శీలురయిన వారు ధన్యులు అని తన రాజ్యమును కుమారునికి ఇచ్చివేసి శుద్ధ పురుషుని వెంట నుండి దైవ సంపదకు నియమములను పాటించి శుద్ధ సాత్విక మోక్షమును పొంది సంసారము నుండి నివృత్తులయిరి. మరి మనం కూడా దైవ సంపదలోని కొన్ని లక్షణములనైనా అలవర్చుకొను ప్రయత్నము చేద్దాం.

### గమనిక

శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు వ్యక్తుల పేర్లతో పంపరాదు. "టు ది రిసివర్, శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమము, గొలగమూడి (పోస్టు), (వయా) సర్వేపల్లి, నెల్లూరు జిల్లా - 524 321" అనే అడ్రసుకు పంపవలెను.

## మా ఇతర ప్రచురణలు:


| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ\|\| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ\|\| |
| 3. | శ్రీ వెంకయ్య స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంధము, తెలుగు | 40 రూ\|\| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ\|\| |
| 6. | శ్రీ వెంకయ్య స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ\|\| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర . | 15 రూ\|\| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ\|\| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ\|\| |
| 10. | మౌన బోధ | 1 రూ\|\| |
| 11. | పిలచిన పలికే దైవం | 1 రూ\|\| |
| 12. | ధర్మమూర్తి | 1 రూ\|\| |
| 13. | బోధ యజ్ఞాయ నమః | 1 రూ\|\| |
| 14. | దివ్య లీలలు | 1 రూ\|\| |
| 15. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 1 రూ\|\| |
| 16. | శ్రీ స్వామి కృప | 1 రూ\|\| |
| 17. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ\|\| |
| 18. | ఆచార్య భరద్వాజ గారి సత్‌సంగము | ఉచితము |
| 19. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 20. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 21. | శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర | ఉచితము |
| 22. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 23. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 24. | శ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 25. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః | ఉచితము |
| 26. | స్మృతిరహిత ప్రసన్నాయ నమః | ఉచితము |
| 27. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 250 రూ\|\| |




# వార్తాలాపం గ్రంధం పై సమీక్ష




కాపీల కొరకు వ్రాయండి

శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్ట్

పెసల సుబ్బరామయ్య,

గొలగమూడి(పోస్టు),

నెల్లూరు జిల్లా - 524 321.

వెల : 150 రూ||  పేజీలు : 1054